# నిర్దేశిత సమయంలో భూసర్వేను పూర్తి చేయాలి : ఏపీ సీఎం

అమరావతి, జూన్ 6: ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూసర్వేను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంపై తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. వందేళ్ల తర్వాత సర్వే జరుగుతోందని, ఈ సర్వేను పూర్తిచేయడం ద్వారా ప్రజలకు, రాష్ట్రానికి మేలు జరుగుతుందని వివరించారు. దశాబ్దాల తరబడి నెలకొన్న భూ సమస్యలకు సర్వేలో పరిష్కారం లభిస్తుందని వెల్లడించారు.

సర్వే పూర్తికి అవసరమైన సిబ్బందిని సమకూర్చుకోవాలని, సాంకేతిక పరికరాలను అవసరాలకు అనుగుణం గా తెప్పించుకోవాలని సూచించారు. డ్రోన్లు, ఓఆర్ఐ పరికరాలు, రోవర్లు, సర్వే రాళ్లు సమకూర్చుకోవడంలో వేగవంతంగా పనులు నిర్వహించాలని సూచించారు.

సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ముత్యాలనాయుడు, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, అటవీ పర్యావరణ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎస్ సమీర్ శర్మ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సమస్త జీవరాసులకు చెట్లే ప్రాణవాయువు : మంత్రి పువ్వాడ

హైదరాబాద్, జూన్ 6:ఈ విశ్వం మీద నివసిస్తున్న సకల జీవరాశులకు చెట్లే ప్రణవాయువు అని, మొక్కల ప్రాముఖ్యతను తెలుసుకుని ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆధ్యాత్మికత, యోగా రంగాల్లో ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన బ్రహ్మ కుమారీస్ సమాజం అధ్వర్యంలో చేపట్టిన 40 లక్షల మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా సోమవారం మంత్రి పువ్వాడ నివాసంలో బ్రహ్మకమారిలతో కలిసి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ..యోగా, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలను బోధించే బ్రహ్మకుమారీలు 50వ 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం' సందర్భంగా మొక్కలు నాటాలనే బృహత్తర సంకల్పంతో 'కల్ప తరు' పేరున ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు.

పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం కులషితమై మనిషి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందనే ఆవేదనతోముఖ్యమంత్రి కేసీఅర్ హరితహరం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. మొక్కలు నాటడంతో మాత్రమే ఈ సృష్టిని కాపాడగలమనే ఒకే ఒక్క నమ్మకంతో కేసీఅ కొనసాగిస్తున్న హరితహారం అడుగుజాడల్లో బ్రహ్మకుమారీ సమాజం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం మంచి నిర్ణయమన్నారు.

జూన్ 5వ తేదీ నుంచి ఆగస్టు 25 వరకు జరగనున్న'కల్పతురు క్యాంపెయిన్' లో భాగంగా క్యాంపెన్ ద్వారా దేశ వ్యాప్తంగా బ్రహ్మకుమారీస్ సెంటర్ల తరఫున 40లక్షల మందితో కనీసం 40 లక్షల మొక్కలు నాటేందుకు కృషి చేస్తున్నట్లు బ్రహ్మకుమారీ అరుణ తెలిపారు. కార్యక్రమంలో బ్రహ్మ కుమారీలు బీకే గీత, బీకే రమాదేవి, బీకే ప్రసాద్, బీకే అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

# మన ఊరు- మన బడితో మారనున్న సర్కారు బడుల రూపురేఖలు: మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి, జూన్ 6:మన ఊరు- మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. పల్లెనిద్రలో భాగంగా వనపర్తి మండలం పెద్దగూడెం తండాలో మంత్రి మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలు పరిశీలించారు. బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 26,065 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో చదువుతున్న 19,84,167 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పమని చెప్పారు.

దశలవారీగా అన్ని పాఠశాలల్లో డిజిటల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరచడం, మౌలిక వసతులను ఏర్పాటుచేసేందుకే ఈ పథకాన్ని రూపొందించామన్నారు. దీనికోసం ప్రభుత్వం రూ.7,289 కోట్లు ఖర్చుచేయనున్నదని తెలిపారు. మొదటి దశలో రూ.3,497.62 కోట్లు కేటాయించామన్నారు.

# నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ యొక్క అక్టోబర్ 2022 పబ్లిక్ పరీక్షల కొరకు పరీక్ష ఫీజు ఆన్ డిమాండ్ , ట్యూటర్ మార్కడ్ అసైన్ మెంట్స్)లను యొక్క వివరాలు

హైదరాబాద్, జూన్ 6:నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఔమిూ) యొక్క సీనియర్ సెకండరీ (12వ తరగతి) అక్టోబర్ 2022 పబ్లిక్ పరీక్షల కొరకు విద్యార్థులు పరీక్ష ఫీజు, 01 జూన్ నుంచి 30 జూన్ వరకు ఆలస్య రుసుము లేకుండా, 01 జులై నుంచి 30 జులై, 2022 వరకు 100 రూపాయలు ఆలస్య రుసుముతో, 11 జులై నుంచి 20 జులై, 2022 వరకు ఏకీకృత ఆలస్య రుసుముతో (కన్సాలిడేటెడ్ లేట్ ఫీజు) ను ఔమిూ వెబ్ సైట్ https://sdmis.nios.ac.in ద్వారా ఆన్ లైన్ లో మాత్రమే చెల్లించగలరు (ఆఫ్ లైన్ పరీక్ష ఫీజు సీకరించబడదు). పరీక్షల యొక్క నిర్వహణ తేదీలు (పరీక్ష షెడ్యూలు) త్వరలో తెలుపబడును.

ఔమిూ ఆన్ డిమాండ్ (ాఆఇ) స్ట్రీమ్ 3 (10వ తరగతి సమాంతరమైన) మరియు స్ట్రీమ్ 4 (12వ తరగతి సమాంతరమైన) పరీక్షల కొరకు రిజిస్ట్రేషన్ 1 జూన్ 2022 నుంచి www.nios.ac.in, https://sdmis.nios.ac.in ద్వారా చేసుకొనవచ్చు. ఈ ఆన్ డిమాండ్ పరీక్షలు ప్రతి మంగళ, బుధ, గురు వారాలలో జరుగును.

ఔమిూలో సెకండరీ (10వ తరదగతి), సీనియర్ సెకండరీ (12వ తరగతి)లలో ప్రవేశము పొందిన స్ట్రీమ్ 1 విద్యార్థులు తమ టిఎమ్ఎ (ట్యూటర్ మార్కడ్ అసైన మెంట్)లను ఆన్ లైన్ లో మాత్రమే సమర్పించగలరు. (ఆఫ్ లైన్ లో టిఎమ్ఎ లు స్వీకరించబడవు).

విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ యొక్క పబ్లిక్ పరీక్ష ఫీజులను/ఆన్ డిమాండ్ (ాఆఇ) ఉ టిఎమ్ఎ (ట్యూటర్ మార్కడ్ అసైన్ మెంట్)లను ఔమిూ వెబ్ సైట్ ష్ట్రబిబిజూబ://బటఎతిబ.నితినీబ.జీఇ.తిని ద్వారా ఆన్ లైన్ లో మాత్రమే సమర్పించగలరు. పైన పేర్కొన్న వాటికి సంబంధించి ఏమైన సమస్యలు లేదా ఇతర వివరాలకు ప్రాంతీయ కేంద్రం, హైదరాబాద్ 040-24752859 లేదా 24750712 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించగలరని ప్రాంతీయ సంచాలకులు అనిల్ కుమార్ తెలిపారు.

# 2026 నాటికి తొలి బుల్లెట్ రైలు పరుగులు : అశ్విని వైష్ణవ్



న్యూఢిల్లీ, జూన్ 6:గుజరాత్‌లోని సూరత్-బిలిమోరా మధ్య తొలి బుల్లెట్ రైలును 2026 నాటికి నడపాలన్న లక్ష్యాన్ని చేరుకుంటామనే విశ్వాసం ఉందని, ఈ మేరకు చాలా పనులు పూర్తి చేసినట్లు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. సూరత్‌లోని చోరియాసి తాలూకాలోని వక్తానా గ్రామ సమీపంలో ముంబై ? అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్ సెక్షనల్ కాస్టింగ్ యార్డ్ ఆపరేషన్‌ను సోమవారం పరిశీలించారు. దీంతో పాటు ప్రాజెక్టు కింద నిర్మాణంలో ఉన్న అంటోలి రైల్వే స్టేషన్‌ను సందర్శించారు.

ఆ తర్వాత రైల్వేశాఖ సహాయ మంత్రి దర్శన్ జర్దోష్‌తో కలిసి నవ్‌సారిలోని నసిల్‌పూర్‌కు వెళ్లి, అక్కడ ప్రాజెక్ట్ స్థలాన్ని సైతం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహ్మదాబాద్ - ముంబై మధ్య బుల్లెట్ ట్రైన్‌కు సంబంధించి మౌలిక సదుపాయాల కల్పనలో మంచి పురోగతి సాధించామని, పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. బుల్లెట్ రైలు ప్రాజెక్టు కోసం 61 కిలోమీటర్ల మార్గంలో పిల్లర్లు ఏర్పాటు చేశామని, దాదాపు 150 కిలోమీటర్ల మార్గంలో పనులు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. మహారాష్ట్రలో ఏడు కిలోమీటర్లు సముద్రం గుండా వెళుతుందని, ఈ లైనులో 12 రైల్వే స్టేషన్లు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.

ఇందులో ఎనిమిది గుజరాత్‌లో, నాలుగు మహారాష్ట్రలో ఉంటాయన్నారు. రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి, కొత్త వందేభారత్ రైళ్లు, ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ, బుల్లెట్ రైళ్లు, అల్ట్రా మోడ్రన్, అత్యుత్తమ సేవలు అందించడవే ప్రధాని లక్ష్యమన్నారు. 130 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఇది జాతీయ ప్రాజెక్టు అని, ఇందులో ఎలాంటి రాజకీయాలు ఉండకూడదని అన్నారు. మహారాష్ట్రలో భూసేకరణ పూర్తయ్యే వరకు గుజరాత్‌పై దృష్టి సారిస్తామన్నారు.

# సస్పెన్షన్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలి : మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్‌నగర్, జూన్ 6:మినీ ట్యాంక్ బండ్‌లో చేపట్టిన ఐలాండ్, సస్పెన్షన్ బ్రిడ్జి పనులను త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అధికారులను ఆదేశించారు.

సోమవారం మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులను మంత్రి తనిఖీ చేశారు. వర్షాకాలం సమీపిస్తున్నందున పెద్ద చెరువులో పూడిక తీసే పనులను వేగవంతం చేయాలన్నారు.

అదేవిధంగా సస్పెన్షన్ బ్రిడ్జి పనులు, ఐలాండ్ పనులు కూడా త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఒకేసారి ఐలాండ్ , తీగల వంతెన, నెక్లెస్ రోడ్డు నిర్మాణం పనులన్ని జరిగేలా చూడాలన్నారు.

అవసరమైతే మరింత మంది లేబర్, యంత్రాలను ఉపయోగించి పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

ఈ సందర్భంగా వర్షపు నీరు చెరువులో చేరకుండా అదేవిధంగా మురికి నీరు చెరువు లోకి రాకుండా బయటికి పంపేలా తీసుకోనే చర్యల పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు పలు సూచనలు చేశారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ కె నరసింహులు, ముడా చైర్మన్ వెంకన్న, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఇరిగేషన్ ఇంజినీర్లు, తదితరులు ఉన్నారు.

# అమరావతిలో శ్రీవారి ఆలయ మహాసంప్రోక్షణకు విస్తృత ఏర్పాట్లు



అమరావతి, జూన్ 6:అమరావతిలో నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జూన్ 9న ప్రాణ ప్రతిష్ట, మహాసంప్రోక్షణకు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో అవకాశం ఉండడంతో ఇవాళ టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి, జెఈవో వీరబ్రహ్మంతో కలిసి అమరావతి ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ మహాసంప్రోక్షణ కార్యక్రమానికి ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, విశాఖ శారద పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర స్వామివారు విచ్చేస్తారని అన్నారు. ఇటీవల పలు రాష్ట్రాల రాజధాని నగరాల్లో నిర్మించిన ఆలయాల కంటే ఇక్కడి ఆలయం చాలా పెద్దదని, సుమారు రూ.40 కోట్ల వ్యయంతో నిర్మించామని వెల్లడించారు.

ఇక్కడ 25 ఎకరాల స్థలం ఉందని, పచ్చదనం పెంచడంతో పాటు ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆర్టీసీ అధికారులతో చర్చించి చుట్టుపక్కల ఉన్న వివిధ ప్రాంతాల నుంచి భక్తులకు రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు.

# ఏపీలో పదో తరగతి పరీక్షా ఫలితాలు విడుదల..బాలికలదే హవా



అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 6 లక్షల 15 వేల 980 మంది విద్యార్థులు హాజరు కాగా 4లక్షల 14,281 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

బాలురు 3 లక్షల16,820 మంది పరీక్షలు రాయగా 2 లక్షల 2081 మంది ఉత్తీర్ణత సాధించారు.

బాలికలు రెండు లక్షల 99వేల 85 మంది పరీక్షలు రాయగా రెండు లక్షల 11వేల 460 మంది పాసయ్యారు.

ఈసారి కూడా బాలికలే అత్యధికంగా ఉత్తీర్ణత సాధించారు.

797 పాఠశాలలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని వివరించారు. 71 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా పాసు కాలేదని బొత్స వెల్లడించారు. రాష్ట్రంలోని 23 జిల్లాల్లో ప్రకాశం జిల్లాలో అత్యధిక సంఖ్యలో 78.30శాతం మంది విద్యార్థులు పాసయ్యారని ఆయన వివరించారు. అనంతపురం జిల్లాలో అత్యల్పంగా ఉత్తీర్ణత శాతం నమోదైంది. పక్కనున్న నాలుగు రాష్ట్రాల్లో కంటే ముందుగా పది పరీక్షల ఫలితాలను విడుదల చేయడం రికార్డు అని ఆయన పేర్కొన్నారు.

# తిరుమల శ్రీవారికి భారీ విరాళం.. టీటీడీ చరిత్రలో ఇదే మొదటిసారి

తిరుమ, జూన్ 6:: కలియుగ ప్రత్యక్ష దైవంగా కొలవబడుతున్న తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి తమిళనాడుకు చెందిన భక్తులు భారీ విరాళాన్ని అంద జేశారు. టీటీడీ చరిత్రలో అధిక మొత్తంలో ఒకేరోజు భారీ విరాళాన్ని తమిళనాడు భక్తులు రూ. 10 కోట్లు అందజేసి స్వావి ంవారి పట్ల వారికున్న భక్తిని చాటుకున్నారు. తిరునల్వేలికి చెందిన గోపాల బాలకృష్ణన్ అనే భక్తుడు రూ. 7 కోట్లు స్వామివారికి సమర్పించుకున్నాడు.అదేవిదంగా టీటీడీ నిర్వహణలో ఉన్న అన్నదానం సహ ట్రస్టులకు విరాళం అందజేశారు. ఏ స్టార్ టెస్టింగ్ అండ్ ఇన్‌స్పెక్షన్ ప్రైవేట్ లిమిటెట్ సంస్థ కోటీ విరాళం అందజేసింది. బాలకృష్ణ ఫ్యూయల్ స్టేషన్ సంస్థ శ్రీవాణి ట్రస్టుకు రూ. కోటీ, సి హబ్ ఇన్‌స్పెక్షన్ సర్వీసెస్ సంస్థ ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్టుకు రూ. కోటీ విరాళాన్ని అందజేసింది. ఈ మేరకు దాతలు తిరుమలలో ఈవో ధర్మారెడ్డికి చెక్కులను అందజేశారు

# తమిళనాడులో 12 ఒమిక్రాన్ సబ్ వేరియంట్ కేసులు నమోదు

చెన్నై,జూన్ 6: దేశ వ్యాప్తంగా కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయి. తాజాగా తమిళనాడులో ఒమిక్రాన్ కొత్త సబ్ వేరియంట్ కేసులు 12 నమోదైనట్లు ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఎం సుబ్రమణియన్ మీడియాకు వెల్లడించారు.

మొత్తం 300 శాంపిళ్లను హైదరాబాద్‌లోని డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్, డయాగ్నోస్టిక్‌కు పంపించగా, ఇందులో 12 నమూనాల్లో ఒమిక్రాన్ కొత్త సబ్ వేరియంట్లు బయటపడ్డాయని ఆరోగ్య మంత్రి పేర్కొన్నారు.

ఇందులో నలుగురిలో బీఏ.4, మరో 8 మందిలో బీఏ.5 వేరియంట్ బయటపడిందన్నారు.

ఏదేమైనప్పటికీ.. ఈ 12 మంది ఆరోగ్యంగా ఉన్నారని ఎం సుబ్రమణియన్ స్పష్టం చేశారు. వీరంతా ఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణలో ఉన్నట్లు తెలిపారు. కొత్త వేరియంట్ నమోదైన వారి కాంటాక్ట్స్‌ను గుర్తించే పనిలో ఆరోగ్య శాఖ అధికారులు నిమగ్నమైనట్లు మంత్రి పేర్కొన్నారు.ం

# స్పైస్‌జెట్‌కు రూ.10 లక్షల జరిమానా...

న్యూఢిల్లీ, జూన్ 6: డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్‌కు రూ.10 లక్షల జరిమానా విధించింది. తప్పుడు సిమ్యులేటర్లపై పైలట్లకు శిక్షణ ఇచ్చినందుకు మే 30న ఈ మేరకు ఫైన్ వేసింది. ఈ నేపథ్యంలో స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్ దీనిపై సోమవారం వివరణ ఇచ్చింది. మాక్స్ ఎయిర్‌క్రాఫ్ట్ నడిపేందుకు 650 మంది పైలట్లకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపింది. అయితే 90 మంది పైలట్లు తప్పుడు సిమ్యులేటర్లపై శిక్షణ పొందినట్లుగా డీజీసీఏ గమనించినట్లు చెప్పింది. ఈ నేపథ్యంలో డీజీసీఏ సూచనల మేరకు ఈ 90 మంది పైలట్లను మాక్స్ ఎయిర్‌క్రాఫ్ట్ నడపకుండా నిరోధించినట్లు పేర్కొంది.

ఈ 90 మంది పైలట్లకు సరైన సిమ్యులేటర్లపై మళ్లీ శిక్షణ ఇస్తామని స్పైస్‌జెట్ వివరించింది. వీరి శిక్షణపై డీజీసీఏ సంతృప్తి చెందితే మాక్స్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను నడిపేందుకు అనుమతిస్తామని వెల్లడించింది. ఈ చర్య వల్ల మాక్స్ విమానాల ఆపరేషన్స్‌పై ఎలాంటి ప్రభావం ఉండదని స్పైస్‌జెట్ తెలిపింది. తగినంత శిక్షణ పొందిన పైలట్లు సంస్థకు అందుబాటులో ఉన్నారని పేర్కొంది.

కాగా, బోయింగ్ 737 మాక్స్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను నడిపేందుకు తప్పుడు సిమ్యులేటర్లపై పైలట్లకు శిక్షణ ఇచ్చిన స్పైస్‌జెట్‌కు డీజీసీఏ రూ.10 లక్షల జరిమానా విధించింది. అలాగే ఆ 90 మంది స్పైస్‌జెట్ పైలట్లు బోయింగ్ 737 మాక్స్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను నడపకుండా చర్యలు చేపట్టింది. వారి శిక్షణ విమానం భద్రతపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో 90 మంది పైలట్లకు తిరిగి శిక్షణ ఇవ్వాలని స్పైస్‌జెట్‌ను డీజీసీఏ ఆదేశించింది.

# నిర్దేశించిన ఏ ఒక్క పని కూడా వదలొద్దు : పువ్వాడ

ఖమ్మం జూన్ 6: పట్టణ ప్రగతిలో నిర్దేశించిన ఏ ఒక్క పని కూడా వదలొద్దని, పూర్తి స్థాయిలో ఆయా పనులు పూర్తి చేయాలని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అధికారులను అదేశించారు. పట్టణ ప్రగతిలో భాగంగా సోమవారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో కొనసాగుతున్న పనులను స్వయంగా పరిశీలించారు. 36వ డివిజన్ ఖూఖీ రోడ్డులో పక్కన కాల్వలో మురుగు తొలగించే పనులను ప్రారంభించారు. గాంధీ చౌక్ సెంటర్‌లో రోడ్డు మరమ్మతు పనులను పారతో స్వయంగా చేశారు.

50వ డివిజన్ రాపర్తి నగర్‌లో నాలాను శుభ్రం చేసే పనులను ప్రారంభించారు. చెత్త చెదారం తొలగించి పూర్తి స్థాయిలో బాగు చేయాలన్నారు. 51, 52వ డివిజన్ బొఖ క్యాంపులో ప్రభుత్వ భూములను శుభ్రం చేసి సంరక్షించాలని అధికారులను ఆదేశించారు.

16వ డివిజన్ లక్ష్మి గార్డెన్స్ ఎదురుగా నూతనంగా ఎర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనాన్ని మంత్రి పువ్వాడ ప్రారంభించారు.ఆయా పనుల్లో భాగంగా ప్రజల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పట్టణ ప్రగతి కార్యక్రమంలో చేపట్టాల్సిన పనులు, గత పట్టణ ప్రగతిలో చేపట్టిన పనుల పరిష్కారం, పురోగతిపై మున్సిపల్ అధికారులను ఆరా తీశారు. అభివృద్ధి పనులతో పాటు పారిశుధ్య పనులు కూడా ప్రాథమిక బాధ్యతగా చేపట్టాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. అభివృద్ధితో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందుతున్నాయన్నారు. అయితే వాటిని సకాలంలో అర్హులైన వారందరికి అందేలా చూసే బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు.

పల్లె, పట్టణ ప్రగతిలో ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ తప్పక పాల్గొనాలన్నారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, ఏఎంసీ చైర్మన్ లక్ష్మి ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో మరో దారుణం.. భార్య ను చంపి డ్రమ్ములో దాచిన భర్త

హైదరాబాద్, జూన్ 6:అత్యాచారాలకు , రోడ్డు ప్రమాదాలకు , డ్రగ్స్ కు ఇలా ప్రతి నేరానికి జూబ్లీహిల్స్ కేరాఫ్ గా మారుతుంది. ప్రస్తుతం జూబ్లీహిల్స్ మైనర్ బాలిక అత్యాచార ఘటన వార్తల్లో నిలుస్తుండగానే మరో దారుణం బయటపడింది. కట్టుకున్న భార్య ను అతి కిరాతకంగా చంపి డ్రమ్ములో దాచిపెట్టిన ఘటన ఇప్పుడు వార్తల్లో హైలైట్ గా నిలుస్తుంది.జూబ్లీహిల్స్ లోని ఎస్పీఆర్ హిల్స్ లో నివాసం ఉ ండే ఓ వ్యక్తి..తన రెండో భార్య ను అతి కిరాతకంగా చంపి , బాడీ ని రెండు ముక్కలు చేసి డ్రమ్ములో పెట్టి.. దానిపై దుస్తులు కప్పి వెళ్లిపోయాడు. ఇంట్లో నుండి దుర్వసన రావడం తో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటాల స్థలానికి వచ్చి డెడ్ బాడీ ని స్వాధీనం చేసుకున్నారు. నాలుగు రోజుల క్రితమే చంపి ఉంటాడని పోలీసులు నిర్ధారించారు. కాగా, 2020లోనే నిందితుడు తన మొదటి భార్యను హతమార్చాడని పోలీసులు పేర్కొన్నారు. రెండో భార్యను ఆరు నెలల క్రితం వివాహం చేసుకున్నాడని స్థానికులు చెప్పుకొచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నామని, హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకునే పనిలో పడ్డారు. అలాగే హంతకుడని గాలింపు చేపట్టారు.

# కరెన్సీ నోట్లపై మహాత్ముడి చిత్రం మార్చే ఆలోచన లేదన్న ఆర్‌బీఐ

న్యూఢిల్లీ, జూన్ 6: కరెన్సీ నోట్లపై మహాత్మా గాంధీ చిత్రం మార్పుపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పష్టత ఇచ్చింది. ప్రస్తుతం కరెన్సీపై ఉన్న గాంధీ ముఖ చిత్రాన్ని మార్చే ఆలోచన ఏదీ లేదని స్పష్టం చేసింది. భారతీయ కరెన్సీ నోట్లపై మార్పులు చేయాలని ఆర్‌బీఐ యోచిస్తున్నట్లుగా మీడియాలో వార్తలు వస్తున్నాయని.. ఇలాంటి ప్రతిపాదనేదీ లేదని, ఈ విషయాన్ని గమనించాలని కోరుతూ సోమవారం ప్రకటన విడుదల చేసింది.ప్రస్తుతం ఉన్న కరెన్సీపై విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌తో పాటు మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఫొటోలను కరెన్సీపై ముద్రించేందుకు ఆర్‌బీఐ సిద్ధమవుతుందన్నట్లుగా వార్తలు వచ్చాయి. దీనిపై ఆర్థిక మంత్రిత్వశాఖ, ఆర్‌బీఐ త్వరలోనే కీలకమైన ముందడుగు వేయవచ్చని జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న భారతీయ కరెన్సీ, నోట్లలో ఎలాంటి మార్పులు చేయాలనే ప్రతిపాదన ఏమీ లేదని, ఇలాంటివి కేవలం ఊహాగానాలేనని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది.

# రైల్వే ప్రయాణికులకు ఐఆర్‌సీటీసీ బంపర్ ఆఫర్.. టికెట్ల బుకింగ్ లిమిట్ డబుల్

న్యూఢిల్లీ, జూన్ 6:రైల్వే ప్రయాణికులకు ఐఆర్‌సీటీసీ బంపర్ ఆఫర్ ఇచ్చింది. ఇప్పటి వరకు ఉన్న టికెట్ల బుకింగ్ పరిమితిని డబుల్ చేస్తున్నట్లు ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ప్రకటించింది. ప్రస్తుతం ఆధార్ లింక్ చేయని ఐఆర్‌సీటీసీ యూజర్లు ఒక్కో ఐడీ నుంచి నెలకు గరిష్ఠంగా 12 టికెట్లు బుక్ చేసుకోవచ్చని పేర్కొంది. ఆధార్ లింక్ చేసిన యూజర్లు 24 టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపింది. అయితే, ఈ కేటగిరీకి సంబంధించి షరతు విధించింది. యూజర్ ఐడీని ఆధార్‌తో లింక్ చేసి, టికెట్ బుక్ చేసుకును ప్రయాణికుల్లో ఒకరి ఆధార్‌ను వెరిఫై చేయాలని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా.. ఐఆర్‌సీటీసీ నిబంధనల ప్రకారం.. ప్రస్తుతం నెలకు ఆధార్ అనుసంధానం చేయని యూజర్ ఐడీ ద్వారా నెలలో ఆరు టికెట్లను మాత్రమే బుక్ చేసుకునేందుకు అవకాశం ఉన్నది. అయితే, దీన్ని 12కు పెంచింది. ఇదే సమయంలో ఆధార్ అనుసంధానం చేసిన యూజర్ ఐడీతో ప్రస్తుతం నెలకు 12 టికెట్లు మాత్రమే బుక్ చేసుకునే వీలుండగా.. దీన్ని రెట్టింపు చేసింది. ఇకపై నెలలో యూజర్లు 24 టికెట్లను బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది.


ఆహ్వానం

కిన్నెర ఆర్ట్ థియేటర్స్
శ్రీ త్యాగరాయగానసభ- ద్వానా సాహితీ కుటీరం




సాహిత్య సవ్యసాచి, విమర్శనకళాప్రవీణ
డా॥ ద్వానా శాస్త్రి 75వ జయంతి సందర్భంగా
ప్రముఖ రచయిత్రి
డా॥ సిహెచ్. భవానీదేవి గారికి
ద్వాదశి లక్ష్మి ప్రసన్న స్మారక పురస్కారం

నేటి నిజం సంపాదకులు
శ్రీ బైస దేవదాసు గారికి
ద్వానా శాస్త్రి స్మారక పురస్కారం బహూకరణ




బుధవారం 15, జూన్ 2022 సా॥ 6 గంటలకు
కళా సుబ్బారావు కళావేదిక, శ్రీ త్యాగరాయగానసభ,
చిక్కడపల్లి, హైదరాబాద్

ముఖ్యఅతిథి :
డా॥ కె.వి. రమణ, ఐఎఎస్ (రి)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు

సభాధ్యక్షులు :
డా॥ వోలేటి పార్వతీశం
సి.ఇ.ఓ., జయజయశంకర టి.వి. ఛానల్

విశిష్ట అతిథి :
శ్రీ కళా జనార్దనమూర్తి
అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ

ఆత్మీయ అతిథి :
శ్రీ ద్వాదశి శశికాంత్ (ద్వానా శాస్త్రి కుమారుడు)

డా॥ ఆర్. ప్రభాకరరావు, I.P.S. (Retd.) అధ్యక్షులు, కిన్నెర | మద్దాళి రఘురామ్ కార్యదర్శి, కిన్నెర | కళాశారద కార్యదర్శి, శ్రీ త్యాగరాయగానసభ

